

AVM

# సర్వేజనాః సుఖినో భవంతు

**ఆ**యన మహాపండితుడు!

ఎందులో అని అడక్కండి! తెలుగులోనే కాదు, ప్రపంచ భాషలన్నిటిలో గల బూతు పంచాంగమంతా ఆయనకి క్షుణ్ణంగా వచ్చు. చాలామంది ఆయన్ను కాస్త రెచ్చగొట్టి, ఆ పంచాంగం చెవులారా విని ఆనందిస్తుంటారు.

ఆయన తిట్లు తినని జీవి లేదంటే అతిశయోక్తికాదు.

మహాత్ముడి దగ్గర్నుంచి మూల ముడుచుకు పడుకున్న ముసలాడి దాకా అందర్నీ ఆయన ఏదో కారణంగా తిడుతూనే ఉంటాడు.

"గాంధీగారిని మన దేశంలో పుట్టమని ఎవరు చెప్పారండీ. ఏ అమెరికాలోనో, రష్యాలోనో పుడితే పోయేదిగా. ఆయన సత్యాగ్రహం నేర్పిపోయాడు. దేశం అసత్యాగ్రహాలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా ఆందోళనలు, అల్లర్లు. ఎందుకండీ... యిన్ని మందులు కనిపెట్టి ముసలాళ్లని బ్రతికిస్తారు? కుటుంబ నియంత్రణ కంటే జనాభా నియంత్రణ ముఖ్యం. ముసలాళ్లకి మందులివ్వటం మానెయ్యండి. పథ్యం గిథ్యం లేకుండా చచ్చేదాకా అన్నీ తిననీయండి. తృప్తిగా చావనీయండి..."

ఇలా వీపరీత ధోరణిలో మాట్లాడే ఆయన్ను అందరూ 'బూతుల మాస్టారు' అంటారు. ఆయన వేషం కూడా విచిత్రంగా ఉంటుంది. ఖద్దరు లాల్చీ, గ్లాస్కో పంచె, మెళ్లో తులసి, రుద్రాక్షలు సగంసగం ఉన్న మాల. విభూతి మీద పంగనామాలు సన్నగీతల్లాగా పెడతాడు. ఎప్పుడూ తాంబూలం నములుతూ కనుపిస్తాడు.

ఎవరన్నా ఆ విచిత్ర వేషం మీద కామెంట్ చేస్తే "దేవుడి విషయంలో పార్టీలూ, పాలిటిక్స్ ఎందుకని యిలా రాజీ మార్గం ఎంచుకున్నాను. మనిషికి కోపం వస్తే ఫరవాలేదు. దేవుడికి కోపం వస్తే ప్రమాదం కదా?" అంటాడు.

సినిమాలు ఎక్కువగా చూసే ఒక కొంటె కుర్రాడు బూతుల మాస్టారు పేరు కుదించి, "బూమా" అని మార్చి, దాన్ని బాగా ప్రచారంలోకి తెచ్చాడు. ఇప్పుడు బూమాగారంటే తెలియనివాళ్లు లేరు.

బూమాకి ఒక శుభోదయంలో కొత్త ఆలోచన పుట్టుకొచ్చింది. ప్రతివాడూ పుట్టేదాది గిట్టేవరకూ స్వార్థంతో సతమతమయిపోతున్నాడు. దాంతో అనేక అనర్థాలూ అఘాయిత్యాలూ జరుగుతున్నాయి. ఈ వెధవ స్వార్థాన్ని వదిలేస్తే పోలా - అనుకున్నాడు. అనుకుని ఊరుకోలేదు. 'పరోపకారమిదం శరీరమ్' అన్న సూత్రాన్ని అక్షరాలా ఆచరించటానికి పూనుకున్నాడు. విశ్వవేదాన్ని యింపుగా పలికిన వేమన శత

**కేఆర్టీ**

కాన్ని మననం చేసుకుంటూ, అవసరాన్ని బట్టి ఉటంకిస్తూ, ఉపకార ఉద్యమమే జీవిత పరమార్థంగా జీవించసాగాడు.

కులంలేదు మతంలేదు మానవులంతా ఒక్కటే - అంటూ అందరితో కలిసిపోయి, అందరి సమస్యలూ తనవేనన్నట్టు, ఎక్కడ చూసినా ఏదో ఒక సహాయకార్యక్రమంలో కనిపిస్తూ, సహనానికీ, సేవకీ మరో పేరులా మారిపోయాడు.

అతని దీక్ష, పట్టుదల అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆ కాలనీలో అందరూ అతనికి ఆత్మీయులైపోయారు. పిల్లల నుంచి పెద్దల దాకా...

ఎందుకంటే - అతను పిల్లలతో గోలీకాయలు, బిళ్లంగోడు ఆడగలడు. పెద్ద వాళ్లతో పురాణకథల చర్చ చేయగలడు.

ఆడవాళ్లకి కొత్తవంటలు నేర్పగలడు, ఊరగాయలు ఎప్పుడూ తాజాగా ఉండేలా ఉపాయాలు చెప్పగలడు.

చదువుకునే పిల్లలకి హోమ్‌వర్క్‌లో సాయం చేయగలడు, కాలేజి కుర్రాళ్లకి క్లిష్టమయిన పాఠాలను స్పష్టపరచి చెప్పగలడు. అనారోగ్యంతో బాధపడేవారికి ఆరోగ్య సూత్రాలు చెప్పటమే కాదు. ఆచరించే దాకా ఊరుకోడు. అవకాశం, ఆసక్తి ఉన్నవారికి యోగా కూడా నేర్పుతాడు. ఆస్పత్రిలో చేరి ఆదుకునే వాళ్లు లేనివారికి అండగా నిలబడి, అన్ని పనులూ తానుగానే చేస్తాడు. పెళ్లీ పేరంటాలకు తక్కువ ఖర్చులో బడ్జెటు వేస్తాడు. తనే ముందు నిలబడి, శుభకార్యం పూర్తయ్యే వరకూ శ్రమిస్తాడు. ప్రతిఫలం ఏదిచ్చినా పుచ్చుకోకుండా పారిపోతాడు.

ఒకమాటు శివాలయం ఆవరణ శుభ్రం చేస్తూ కనిపిస్తాడు. మరో మాటు విష్ణాలయం మరమ్మత్తుల్లో సాయం చేస్తూ కనిపిస్తాడు. ఇంకో మాటు చర్చి గోడలకు సున్నాలు వేస్తూ కనిపిస్తాడు. అంతకంటే ఆశ్చర్యం - మసీదులో జండాలు కడుతూనో, ఖురాన్ గురించి ముల్లాలతో మాట్లాడుతూనో కనిపిస్తుంటాడు.

ముస్లిములు, క్రిస్టియన్లు తమ మతంలో చేరమంటే, తమ మతంలో చేరమని ప్రాథేయపడ్డారు. మమత ఉంటే చాలు మతం ఏదైతేనేం? - అని తప్పించుకునేవాడు. క్రిస్టియన్లతో మాట్లాడేటప్పుడు బైబిల్ సూక్తులు చెప్పేవాడు. ముస్లిములతో మాట్లాడేటప్పుడు ఖురాన్‌లోని మహిమాన్విత వాక్యాలు చెప్పేవాడు. తన వారితో మాట్లాడేటప్పుడు భగవద్గీత శ్లోకాలు చెప్పి, వాటి అర్థాలు వివరించేవాడు.


ఇవన్నీ ఒక ఎత్తు...

ఎవరైనా మరణిస్తే, ఆ ఆపద కాలంలో మొదట్నుంచి చివరిదాకా అన్ని పనుల్లోనూ కలివిడిగా కలిసిపోయి, ఒకపక్క ఆపదలో ఉన్నవారికి ధైర్యం చెబుతూ మరొక ప్రక్క ఏ పనీ ఆగకుండా చూసుకునేవాడు. ఎంతో అనివార్యం అయితే తప్ప ఎవరింట్లోనూ భోజనం చేసేవాడు కాదు.

శివాలయంలో వర్షంకోసం హోమాలు జరుగుతున్నాయి. చర్చిలో ప్రార్థనలు, మసీదులో నమాజులూ జోరుగా సాగుతున్నాయి. కానీ ఎక్కడా ఆకాశంలో మబ్బు తునక లేదు.

ఊరంతా దీనంగా ఉంది. మనుష్యులకీ, పశువులకీ గొంతు తడుపుకోవటం కష్టంగా ఉంది. బళ్లమీద పీపాలు కట్టుకుని, పొరుగూరి నుంచి నీళ్లు తెచ్చుకుని కాలక్షేపం చేస్తున్నారు. అక్కడ ఊటబావులున్నాయి.

ఉన్నట్లుండి బూమాకి ఒక ఆలోచన కలి




గింది. రచ్చబండ దగ్గర్లో కొత్తగా బావి త్రవ్వితే?! వెంటనే నడుముకి కండువా బిగించి, బావి తవ్వటానికి పూనుకున్నాడు. అతని ప్రయత్నానికి ఊతంగా ఊళ్లో వాళ్లందరూ చేతులు కలిపారు. పదిహేను రోజుల్లో బావి చక్కగా తయారయింది. అయితే కింద రాయి తగిలింది. దాన్ని పగలగొడితే గానీ త్రవ్వకం సాగదు. బలమయిన వాళ్లు పలుగులతో రోజూ ప్రయత్నిస్తూనే ఉన్నారు. కానీ రాయి పొర తరగటం లేదు. అందరి ఆశలూ అడుగంటిపోయాయి. కానీ బూమా ఒక్కడే పలుగుతో రాతి పొర చీల్చటానికి శ్రమిస్తూండిపోయాడు. అలా పదిరోజులు గడిచాయి. పదకొండో రోజున పెద్ద వాన పడింది. అదే సమయంలో బావిలో రాతి పొర పగిలి, దాంట్లోంచి చివ్వున నీరు చిమ్మింది. బూమా ఆనందానికి అంతులేదు. ఆయాసపడుతూ తాళ్లు పుచ్చుకుని పైకి వచ్చాడు. ఆనందంగా పెద్ద పెద్ద కేకలు పెడుతూ అందర్నీ పిలిచాడు. అందరూ పరుగున వచ్చి చూస్తే బావిలో నీరు ఉబుకుతోంది. ఆనందంతో గెంతులు వేసారు. నాట్యాలు చేసారు. ఆనందంతో బూమాని గట్టిగా ఆలింగనం చేసుకుని, అభినందనలతో ముంచెత్తారు.

బూమా ఆయాసంతో కూలబడిపోయాడు.

అతని కళ్లనిండా నీళ్లు.

"దేవుడు కరుణించాడు. ఇవి దేవుడిచ్చిన నీళ్లు. ఇది దేముడి బావి... అందరు... అందరూ... అందరూ... వాడుకోండి" అంటూనే కళ్లు తేలేసాడు. అంతా ఒక్కసారి ఘొల్లుమన్నారు. కన్నీళ్లకి, వాన నీళ్లకీ తేడా లేకుండా పోయింది.

బూమా అంత్యక్రియల్లో ఆబాలగోపాలం పాల్గొన్నారు. బావి దగ్గర అతని విగ్రహం ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం దిమ్మ మీద అన్ని మతాల చిహ్నాలు, సూక్తులూ ఉన్నాయి. పెద్ద పెద్ద అక్షరాల్లో రాయబడిన "సర్వేజనాః సుఖినో భవంతు" అక్షరాలు అందరికీ కర్తవ్యబోధ చేస్తూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. ●